సబ్సిడీ సిలిండర్లు పక్కదారి

- నల్లబజారుకు తరలింపు..
- అధిక మొత్తానికి అమ్ముతున్న కొందరు వినియోగదారులు
- హోటళ్లు, టిఫిన్ షాపుల యజమానులే కొనుగోలుదారులు
- నామమాత్రంగా తనిఖీలు


భద్రాచలంలోని ఓ టిఫిన్ సెంటర్‌లో డొమెస్టిక్ సిలిండర్..

భద్రాచలంఅర్బన్: గృహ అవసరాలకు ప్రభుత్వం రాయితీతో ఇస్తున్న గ్యాస్ సిలెండర్లు పక్కదారి పడుతున్నాయి. ఇళ్లలో వినియోగించాల్సిన సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చికెన్ సెంటర్లు, రొట్టిలు, బజ్జీ బండ్లు, హోటళ్లు, రెస్టారెంట్లలో దర్శనమిస్తున్నాయి. కొంత మంది గ్యాస్ వినియోగదారులు సిలిండర్లను ఇతరులకు అమ్మడంతో వారి వద్దకు చేరుతున్నాయి. ముగ్గురున్న కుటుంబానికి 2 సిలిండర్లు వినియోగం మాత్రమే ఉంటుంది. అటువంటి వారిని వ్యాపారులు ఎంపిక చేసుకుని వారి పేరుపై గ్యాస్ బుక్ చేసుకొని ఇతర అవసరాలకు వినియోగించుకుంటున్నారు. వంట గ్యాస్ దుర్వినియోగం నియంత్రణకు ప్రభుత్వాలు ఎన్ని నిబంధనలు పెట్టినా అక్రమాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ప్రతి కుటుంబానికీ ఒక గ్యాస్ సిలిండర్ కనెక్షన్ ఉండటంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా సబ్సిడీ గ్యాస్‌ను దుర్వినియోగం చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవవుతున్నాయి.

అధిక ధరలే కారణం..

జనరల్‌గా గ్యాస్ ధరలు అధికంగా ఉన్నప్పటికీ సాధారణ సిలిండర్‌తో పోలిస్తే కమర్షిల్ సిలిండర్ల ధర ఎక్కువగా ఉండడంతో బ్లాక్ మార్కెట్‌కు అవకాశం ఏర్పడింది. గ్యాస్ వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలకు ఏ యేటికి ఆయేడు పెచుతూ పోతోంది. 10 ఏళ్ల క్రితం 14.2 కేజీల డొమెస్టిక్ సిలిండర్ రూ.400 ఉండగా ప్రస్తుతం రూ.1142 కి చేరింది. మరోవైపు పదేళ్ల క్రితం కమర్షియల్ సిలిండర్ ధర రూ.900 ఉండగా ప్రస్తుతం వాటి ధర రూ.1970కు పెరిగింది. మొత్తంగా ప్రస్తుతం డొమెస్టిక్ సిలిండ్ ధర రూ.1142 ఉంటే కమర్షిల్ సిలిండర్ ధర రూ.1970 ఉంది. ఈ వ్యత్యాసం మూలంగా రూ.200 నుంచి రూ.300 ఆశించి వినియోగదారులు అమ్ముతుండగా.. కాస్త తక్కువ ధరకు దొరుకుతుందనే ఉద్దేశంతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. మరికొందరు వ్యాపారులు నేరుగా డొమస్టిక్ పేరుతో కొనుగోలు చేయడానికి ఉన్న మార్గాలను అన్వేశించి ఆ దారిలో వెళ్తున్నారు. భద్రాచలం పట్టణంతో 20 వేల కుటుంబాలు డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తుండగా, 450 కమర్షియల్ సిలిండర్లు మాత్రమే వ్యాపారులు వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో డొమెస్టిక్ సిలిండర్లను వినియోగించుకుంటూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. భద్రాచలం పట్టణంలో గతంలో అధికారులు డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తున్న టిఫిన్ సెంటర్లు, హోటల్స్ పై దాడి చేసి, వారిపై కేసులు నమోదు చేశారు. కాగా ఇటీవల కాలంలో ఇలా దాడులు కనుమరుగయ్యాయి.

డొమెస్టిక్ సిలిండర్లే కనిపిస్తున్నాయి..



టిఫెన్ సెంటర్లు, బజ్జీల బండ్లు, రొట్టెల సెంటర్లలో డొమెస్టిక్ సిలిండర్లే కనిపిస్తున్నాయి. కమర్షియల్ సిలిండర్లు వినియోగించాల్సిన చోట డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అధికారులు విషయం తెలిసి కూడా ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం తగదు. పౌర సరఫరాల అధికారులు గ్యాస్ వినియోగాలపై దాడులు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నా వాటి వినియోగాల నియంత్రించలేకపోతున్నారు.

– ప్రశాంత్, భద్రాచలం

చర్యలు తీసుకుంటాం



డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను పలువురు వ్యాపారులు వినియోగిస్తున్నట్లు మా దష్టికి వచ్చింది. ఇప్పటికే పలుమార్లు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశాం. రాయితీతో ఇస్తున్న సిలిండర్లను ఇంటి అవసరాలకే వాడాలి. వ్యాపారులు కమర్షియల్ సిలిండర్లు వినియోగించాలి. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు వాడటం నేరం. అటువంటి వారిపై తప్పక చర్యలు తీసుకుంటాం.

– కాస్తాల వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై అధికారి, భద్రాచలం

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


వ్యాపారులకు సూచనలిస్తున్న కమిషనర్, సీఐ

మణుగూరురూరల్: నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని మణుగూరు మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, సీఐ ముత్యం రమేష్, చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. మణుగూరు పట్టణంలోని చిరు వ్యాపారులతో, ఆటో డ్రైవర్లకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషర్, సీఐ మాట్లాడుతూ.. వాహనదారులు, పాదాచారులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా వ్యాపారాలను సాగించుకోవాలని, ఆటోలను నడుపుకోవాలని సూచించారు. చిరువ్యాపారులు ఎవరైనా ప్రధాన రహదారిపై ఉన్న తెల్ల మార్క్‌ను దాటి వ్యాపారాలు నిర్వహించినా, ఫుట్‌పాత్‌ను ఆక్రమించి బడ్డీలు ఏర్పాటు చేసినా, వాహనదారులు బండ్లను నిలిపిన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఆటోవాలాలు ట్రాఫిక్ నియమనిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై బి.పురుషోత్తం, మున్సిపల్ అధికారులు, పోలీస్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, చిరువ్యాపారులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

దమ్మపేట: ఐటీడీఏ ద్వారా నిధులు మంజూరైన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. బుధవారం మండల పరిధిలోని రామచంద్రాపురం నుంచి లింగాలపల్లి గ్రామాల మధ్య బీటీ రోడ్డు మంజూరు కాగా, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. పనులకు ఐటీడీఏ ద్వారా రూ.కోటి 50 లక్షల ఖర్చు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో రైతు బంధు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు, బీఆర్ఎస్ నాయకులు దారా యుగంధర్, దొడ్డాకుల రాజేశ్వరావు, దొడ్డా రమేష్, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతులు..

దమ్మపేట మండల పరిధిలోని పంచాయతీ కార్మికులు, తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, బుధవారం ఎమ్మెల్యేకు తాటిసుబ్బన్నగూడెంలో వినతిపత్రం అందజేశారు. పామాయిల్ రైతులు విద్యుత్ సరఫరా, అంతర్గత రోడ్లకు సంబంధించిన సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కారిస్తానని తెలిపారు.

చెత్తను తొలగించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో భక్తులు తిని పడేయడంతో పేరుకుపోయిన చెత్తను అధికారులు తొలగించారు. చెత్త సమస్యపై 'ఎక్కడి చెత్త అక్కడే'అనే శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన ఎంపీడీఓ ముత్యాలరావు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డిలు.. బుధవారం తాత్కాలిక కార్మికులను ఏర్పాటు చేసి పర్ణశాలలో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించే పనులను చేపట్టారు.


చెత్త తొలగిస్తున్న తాత్కాలిక కార్మికులు

సౌకర్యాలు ఏర్పాటు చేయండి

గుండాల: కాచనపల్లి బ్యాంకు ఖాతాదారులు ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని గుండాల సీఐ రవీందర్ అన్నారు. బుధవారం కాచనపల్లి ఎస్‌బీఐ బ్రాంచ్‌ను విజట్ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు మేనేజర్‌తో మట్లాడారు. నెట్‌వర్క్ సమస్య ఏర్పడినట్లయితే త్వరగా పరిష్కరించాలని సూచించారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ఉన్నందున ప్రజలు ఎక్కువ సమయం వేచిచూడకుండా చూడాలన్నారు. రుణాలు లేని ఖతాలను గుండాల ఎస్‌బీఐకి ట్రాన్స్‌ఫర్ చేస్తే రద్దీ తగ్గుతుందని సూచించారు. యోనో యాప్‌ను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఖాతాదారులు కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేయాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. దీంతో బ్యాంకు మేనేజర్ స్పందించి హామీ ఇచ్చినట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట కాచనపల్లి ఎస్సై శివరామ కృష్ణ ఉన్నారు.

పోటాపోటీగా నిరసనలు

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

ఇటీవల అమెరికా పర్యటనలో వ్యవసాయానికి విద్యుత్‌పై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ నాయకులు నిరసనలు వ్యక్తం చేశారు. ధర్నాలు నిర్వహించి, రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులకు 24 గంటల ఉచిత నాణ్యతమైన విద్యుత్ అందిస్తుంటే కాంగ్రెస్ పార్టీ మూడు గంటల చాలు, ఎనిమిది గంటలు చాలు అనడం విడ్డూరమన్నారు. వ్యాఖ్యలను భేషరతుగా వెనుక్కు తీసుకొని రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

రైతులకు కరెంట్ విషయంలో రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలను బీఆర్ఎస్ నాయకులు వక్రీకరించారంటూ కాంగ్రెస్ నాయకులు ప్రతి నిరసనకు దిగారు. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. మాట్లాడుతూ.. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా ఉందని అన్నారు. రైతులను మోసం చేస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం అని విమర్శించారు. ఆనాడు రైతులకు తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


మణుగూరులో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రభుత్వ విప్ రేగా, బీఆర్ఎస్ నాయకులు


మణుగూరురూరల్: సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


దుమ్ముగూడెం: లక్ష్మీనగరం గ్రామంలో..


పినపాకలో కాంగ్రెస్ ఆందోళన..


చర్ల: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..


దమ్మపేట: నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


బూర్గంపాడులో..


అశ్వారావుపేటరూరల్: జాతీయ రహదారిపై కాంగ్రెస్ నిరసన

క్లుప్తంగా

ఏజెన్సీల ఖాతాల్లో నగదు జమ

దుమ్ముగూడెం: మండలంలో పెండింగ్‌లో ఉన్న 103 మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీలకు చెందిన బిల్లులను వారి వారి ఖాతాలో జమచేసినట్లు యంఈఓ సున్నం సమ్మయ్య బుధవారం తెలిపారు. 2023 జనవరి నుంచి ఏప్రిల్ వరకు ఉన్న గుడ్డు బిల్లులు రూ.6.56 లక్షలు, ప్రాథమిక పాఠశాలలకు మార్చి నెల వంట బిల్లు రూ.4.52లక్షలు, ఉన్నత పాఠశాలలకు ఫిబ్రవరి బిల్లు రూ.60వేలు ఏజెన్సీల ఖాతాలో జమ చేసినట్లు ఆయన తెలిపారు.

అర్హులకే 'డబుల్' ఇళ్లు

అన్నపురెడ్డిపల్లి: అర్హులైన వారికే ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించినట్లు తహసీల్దార్ భద్రకాళి తెలిపారు. అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో నిర్మించిన 20 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారుల కేటాయింపు కోసం బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బోడా పద్మ అధ్యక్షతన గ్రామసభను ఏర్పాటు చేశారు. సభలో తహసీల్దార్ భద్రకాళి ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో డీటీ రాంనరేష్, ఆర్ఐ మధు, పంచాయతీ సెక్రటరీ ఖాదర్ మీయా, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లకోసారి సవరించాలి

బూర్గంపాడు: ప్రతి ఐదేళ్లకు ఒకసారి కనీస వేతన జీఓలను సవరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ ప్రాజెక్ట్ గేట్ వద్ద కార్మికులతో మాట్లాడుతూ.. ఈ నెల 14వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కందాల వెంకటరెడ్డి, యాకుబ్‌పాషా, బత్తుల గోపాలరావు, జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎం పోస్టులు భర్తీ చేయాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం డివిజన్ పరిధిలోని షెడ్యూల్డ్ ఏరియాకు సంబంధించిన నిరుద్యోగ ఆదివాసీలకు కాంట్రాక్టు ప్రతిపాదికన భర్తీ చేస్తున్న ఏఎన్ఎం పోస్టులను డిస్ట్రిక్ యాక్ట్ ప్రకారం భర్తీ చేయాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, పీఓకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. అనంతరం పాయం సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో పాయం కామేష్, పాయం సన్యాసి, పూణెం నాగేశ్వరావు, సున్నం సుబ్బయ్య, పూసం సుభద్ర, బట్టు జ్యోతి, మడకం రమణ, మడకం సాధర్మ్, పడకం శంకరమ్మ, సీత తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు వినతి

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ టీపీటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ జనరల్, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్ రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. సీఆర్‌టీల నియామకం, ఉపాధ్యాయుల సర్దుబాటు, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. త్వరలోని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఏపీఓ డేవిడ్‌రాజ్ పేర్కొన్నారు.

విస్తరణతో ఇబ్బందులు

భద్రాచలంటౌన్: కొత్త మిషన్లతో ఐటీసీని విస్తరించడం వల్ల గోదావరి తీర ప్రాంత ప్రజలు ఆరోగ్యపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పాల్‌రాజు అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే తరాలకు ఐటీసీ నుంచి వచ్చే కాలుష్యం కారణంగా ఆరోగ్యపరమైన సమస్యలు వస్తాయని అన్నారు. సమావేశంలో శాంతి, రాజు, రామకృష్ణ, జయరాజు, జశ్వంత్, శ్యామ్, శ్యాముల్‌రాజ్ పాల్గొన్నారు.

గిరిజనులనే నియమించాలి

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ పీఓగా గిరిజనుడినే నియమించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు పసుల రవి డిమాండ్ చేశారు. బుధవారం ఐటీడీఏ ఎదుట జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పలు సమస్యలపై వివిధ ప్రాంతాల నుంచి గిరిజనులు, ఆదివాసీలు ఐటీడీఏకు వచ్చినా వినతిపత్రాలు స్వీకరించేందుకు పీవో కాలాయాపన చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు స్నేహలత, రాష్ట్ర మీడియా వర్కింగ్ ప్రెసిడెంట్ సంజీవరావు, ఆలస్యం వీరన్, వేణుగోపాల్ యాదవ్, చిరంజీవి, విష్ణు పాల్గొన్నారు.

నిర్మాణానికి భూమిపూజ

ములకలపల్లి: మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ప్రహరీ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరుకాగా.. స్థానిక సర్పంచ్ బీబినేని వీరభద్రం బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు శనగపాటి మెహరమణి, బీఆర్ఎస్ నాయకులు శనగపాటి సీతారాములు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె


అశ్వాపురం: అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న గ్రామ పంచాయతీ కార్మికులు

గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం ఏడో రోజుకు చేరింది. యూనియన్ నాయకులు కార్మికులకు పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. పలు చోట్ల కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతో సమ్మెను విచ్చిన్నం చేయాలని చూస్తే తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

– సాక్షి నెట్‌వర్క్

వైస్ ఎంపీపీ వర్సెస్ పశు వైద్యాధికారి



మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి స్వప్న

అశ్వారావుపేటరూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. పలు శాఖలకు సంబంధించి నివేదికలను ఆయా శాఖల అధికారులు చదవి వినిపించారు. ఈ క్రమంలోనే మండల పశు సంవర్ధక శాఖ వైద్యురాలు స్వప్న తన శాఖ వివరాలు వెల్లడించే క్రమంలో అధికార పార్టీకి చెందిన వైస్ ఎంపీపీ చిట్లూరి ఫణింద్ర రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో ప్రభుత్వం లబ్దిదారులకు మంజూరు చేసిన గొర్రెల యూనిట్ల గురించి ప్రశ్నించారు. మండలానికి 21 యూనిట్ల గొర్రెలు మంజూరు కాగా, ఒకొక్క యూనిట్‌కు ప్రభుత్వం రూ.1లక్ష 75వేలు ఖర్చు కేటాయించినట్లు పశు వైద్యాధికారిణి చెప్పారు. కాగా పంపిణీ చేసినట్లు చెబుతున్న యూనిట్లలో ఒక్క గొర్రె కూడా లబ్దిదారుల దగ్గర లేవని వైస్ ఎంపీపీ అందుకున్నారు. గొర్రెలను తీసుకొచ్చే క్రమంలోనే పశు సంవర్ధక శాఖ, లబ్దిదారులు కలిసి అమ్మేశారని, తన వద్ద ఆధారాలు ఉన్నాయని ఆరోపించారు. దాంతో పశు వైద్యాధికారిణి మాట్లాడుతూ.. గొర్రెల పంపిణీలో తన ప్రమేయం లబ్ధిదారుల ఎంపిక వరకేనని, తాను ఒక్క రూపాయి అవినీతి చేసినట్లు నిరూపించినా ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. దాంతో గొర్రెల యూనిట్లపై సమగ్ర విచారణ చేపట్టాలని, ఈ విచారణలో గొర్రెలను అమ్మలేదని నిరూపిస్తే తాను తన వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ పదవికి రాజీనామా చేస్తానని ఆయన ప్రతి సవాల్ విసిరారు. దీంతో సర్వసభ్య సమావేశం వేడెక్కింది. అదే విధంగా ఆంధ్రా నుంచి ఓవర్‌లోడ్‌తో వస్తున్న ఇసుక లారీలతో అశ్వారావుపేట మండలం కొత్తూరు, నారాయణపురం వద్ద బీటీ రహదారి ధ్వంసమౌతోందని డీసీసీబీ డైరెక్టర్ నిర్మల పుల్లారావు ప్రశ్నించగా, దీనిపై చర్యలు తీసుకుంటామని రోడ్లు భవనాల శాఖ ఏఈ కృష్ణార్జునరావు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ లూథర్ విల్సన్, జడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మీ పాల్గొన్నారు.


హాజరుకాని సర్పంచ్‌లు..

మండలంలో మొత్తం 30 మంది సర్పంచ్‌లకు గాను కేవలం ముగ్గురు సర్పంచ్‌లు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. అలాగే మరో ముగ్గురు ఎంపీటీసీ హాజరు కాలేదు. వీరితోపాటు పలు శాఖల అధికారులు సమావేశానికి రాకపోవడంపై ప్రజాప్రతినిధులు అగ్రహం వ్యక్తం చేశారు. హాజరు కానీ అధికారులపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందిస్తానని ఎంపీడీవో తెలిపారు.

విద్యాసంస్థల బంద్ సంపూర్ణం

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన బంద్ విజయవంతమైంది. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పాఠ్య పుస్తకాలు పూర్తి స్థాయిలో అందించలేదని, కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేజీ టూ పీజీ విద్యను ఉచితంగా అందించాలని, నూతన జాతీయ విద్యా విధానం రద్దుకు తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


గుండాల: విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు


దుమ్ముగూడెం: విద్యాసంస్థలను బంద్ చేయిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు



ములకలపల్లి: పాఠశాల వద్ద వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

క్రీడా మైదానానికి వితరణ

అశ్వాపురం: మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామ పంచాయతీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు బుధవారం ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావును కలిసి గ్రామంలో యువత ఆడుకునేందుకు క్రీడా మైదానం లేదని విన్నవించారు. స్పందిచిన రేగా.. రెండు ఎకరాల భూమి కౌలు కోసం రూ.10 వేలు అందజేశారు. కోరెం రామారావు, తాటి ఈశ్వర్‌రావు, తాటి వెంకటేశ్వర్లు, ఇర్పా వెంకటేశ్వర్లు, నాగార్జున్, పూనెం వెంకటేశ్వర్లు, కణితి వెంకటేశ్వర్లు, రాంబాబు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థులు..

అశ్వాపురం: మండల కేంద్రంలోని అశ్వాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 1992–93 బ్యాచ్ పూర్వ విద్యార్థులు బుధవారం రూ.60 వేల విలువ గల గేటును వితరణగా అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కైలాసం రాము, రామడుగు రామాచారి, యార్లగడ్డ చందు, దొండేటి బోసు, సంద్ర సతీష్, జడల రమేష్, రాయల వేణు, చిగురుపాటి తిరుమలరావు, కొర్లకుంట శ్రీనివాసరావు, ముప్వా శ్రీనివాసరావు, రవి, అంజన్‌రావు, వాలి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

చర్ల: వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఓ ఏఎన్ఎం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. మండలంలోని బోదనెల్లి గ్రామపంచాయతీ పరిధి కుకట్‌పాడులో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రంలో సుమారు 30 మంది చిన్నారులు ఉండగా వారికి కేంద్రంలో బుజించడానికి సరైన ప్లేట్లు గ్లాసులు లేవు. ఈ విషయాన్ని అక్కడి అంగన్‌వాడీ కార్యకర్త ద్వారా తెలుసుకున్న కొయ్యూరు సబ్ సెంటర్లోని ఏఎన్ఎం కొర్సా హైమావతి సుమారు రూ.3 వేలతో ప్లేట్లు, గ్లాసులు కొనుగోలు చేసి బుధవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలుర ఆశ్రమానికి..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం శ్రీరామ్ నగర్ కాలనీలోని కారుణ్య బాలుర ఆశ్రమానికి అశ్వాపురం మండలానికి చెందిన కాజ శ్రీనివాస్–సంధ్య దంపతులు వితరణ అందించారు. బుధవారం తమ కుమారుడు కృష్ణ పుట్టిన రోజు సందర్భంగా ఆశ్రమానికి రూ.20 వేలు విలువగల 6 సీలింగ్ ఫ్యాన్లు, 50 మంది చిన్నారులకు భోజన ప్లేట్లు, గ్లాసులు, పుస్తకాలు, పెన్నులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగనారాయణి, మసులూరి శ్రీలక్ష్మి, బిర్రు సుధాకర్, ఆశ్రమ నిర్వహకులు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ బ్యాగులు అందజేత

భద్రాచలంఅర్బన్: ప్రపంచ పేపర్ బ్యాగ్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో స్థానిక కొత్త మార్కెట్ వద్ద బుధవారం ఉచితంగా పేపర్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు బి.వెంకటరెడ్డి, ప్రోగ్రాం చైర్మన్ బోనాల సూర్యనారాయణలు మాట్లాడుతూ.. విధిగా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరారు. కార్యక్రమంలో ఫాస్ట్ ప్రెసిడెంట్ జక్కం ప్రసాద్, కార్యదర్శి గుండు శరత్, ఉమా శంకర్ నాయుడు, బెల్లంకొండ రాంబాబు, టి.ధనం, బిల్లిపెళ్లి రంగారెడ్డి, దాట్ల శ్రీనివాసరాజు, పి.తిరుమలరావు, పద్మనాభం, వాసు తదితరులు పాల్గొన్నారు.